# మా తెలంగాణ అద్భుతం.. పెట్టుబడులు పెట్టండి!

మొదటిపేజీ తరువాయి...

చేశారు. బ్రిడ్జ్ ఇండియా వీక్‌లో ఆయన ప్రసంగించడం వరుసగా ఇది రెండోసారి. 'స్థిరమైన వృద్ధితో ప్రపంచ ఆర్థిక రంగాన్ని నడిపించడంలో తెలంగాణ ఎందుకు ముఖ్యం?' అన్న అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. తొమ్మిదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి లక్ష్యంగా సాగిన పాలన, ఆలోచనలు అద్భుత ఆవిష్కరణలుగా మారిన విధానంతోపాటు తెలంగాణ విజయ ప్రస్థానాన్ని కూలంకశంగా వివరించారు. బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ అభివృద్ధిలో రోల్ మోడల్‌గా నిలిచిందని పేర్కొన్నారు. స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో ప్రజాస్వామ్య పోరాటాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాకారం చేసుకున్నామని తెలిపారు. 2014లో ఎలాంటి ప్రత్యేక ప్యాకేజీ లేకుండా తెలంగాణ కొత్త రాష్ట్రంగా ఏర్పడిందని గుర్తు చేశారు. 2014 నుంచి 2023 వరకు పురపాలక, పట్టణాభివృద్ధి చేనేత, టెక్స్‌టైల్, ఐటీ శాఖ మంత్రిగా తన అనుభవాలను, తొమ్మిదేండ్ల పాలనలో తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన కృషిని కేటీఆర్ విపులంగా వివరించారు.



లండన్‌లో జరిగిన బ్రిడ్జి ఇండియా వీక్-2025 సదస్సులో కీలకోపన్యాసం చేస్తున్న కేటీఆర్

### సంపద సృష్టి.. సమానంగా పంచడంలో వైవిధ్యం..

దృఢ నాయకత్వం, ప్రజల జీవితాలను మార్చాలన్న చిత్తశుద్ధి ఉంటే అద్భుతమైన ప్రగతి సాధ్యమని తెలంగాణ నిరూపించిందని కేటీఆర్ పేర్కొన్నారు. తొమ్మిదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ సాధించిన విజయాలు దేశానికే కాకుండా ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో విప్లవాత్మక పంథాను అనుసరించి వివిధ రంగాల్లో తీసుకొచ్చిన మార్పులు, పాలసీలపై తన అనుభవాలు, ఆలోచనలను కేటీఆర్ పంచుకున్నారు. సంపదను సృష్టించడంతోపాటు దాన్ని సమాజంలోని అట్టడుగు వర్గాలకు సమానంగా పంచడమే తమ హయాంలో తెలంగాణను దేశంలో ప్రత్యేకంగా నిలిపిందని వివరించారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి మధ్య అద్భుత సమతుల్యత సాధించిందని, తమ ప్రభుత్వం చేసిన ప్రగతిశీల పనులు స్వతంత్ర భారత చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఎవరూ చేయలేదని స్పష్టం చేశారు.

### తలసరి ఆదాయంలో దేశంలోనే టాప్

వివిధ దేశాల రాజకీయ నాయకులు, ప్రభావశీల వ్యక్తులు హాజరైన ఈ సదస్సులో మాట్లాడిన కేటీఆర్, తలసరి ఆదాయంలో 12వ స్థానం నుంచి మొదటి స్థానానికి ఎలా ఎదగవచ్చో తెలంగాణను చూసి భారతదేశంలోని ఇతర రాష్ట్రాలు నేర్చుకోవచ్చని చెప్పారు. తలసరి ఆదాయంలో 156 శాతం వృద్ధిని ఒక్క దశాబ్ద కాలంలోనే సాధించిన రాష్ట్రం తెలంగాణ ఒక్కటే అని తెలిపారు. 2014లో తలసరి ఆదాయంలో 12వ స్థానంలో ఉన్న తెలంగాణ, కేసీఆర్ ప్రగతిశీల విధానాలతో 2023 నాటికి నంబర్ వన్ స్థానానికి చేరుకున్నదని చెప్పారు. తమ హయాంలో పాలనను ప్రజలకు చేరువ చేయడంతోపాటు ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించి వ్యక్తుల కంటే విధానాలకే ప్రాధాన్యం ఇచ్చామని అన్నారు. విప్లవాత్మక మార్పులను ఆహ్వానించడంతోపాటు నిర్ణయాధికారాలను వికేంద్రీకరించడమే తెలంగాణను మిగతా రాష్ట్రాల కంటే ప్రత్యేకంగా మార్చిందని వివరించారు.

### టీఎస్ ఐపాస్‌తో పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం

బీఆర్‌ఎస్ ప్రభుత్వ పారిశ్రామిక అనుకూల విధానాల కారణంగా గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఫేస్‌బుక్‌తోపాటు ప్రపంచంలోని ప్రఖ్యాత టెక్ కంపెనీలు అమెరికా తర్వాత తమ అతిపెద్ద క్యాంపస్‌లను హైదరాబాద్‌లో నెలకొల్పాయని కేటీఆర్ చెప్పారు. కార్పొరేట్ సంస్థల్ని హైదరాబాద్‌కు ఆహ్వానించి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించామని తెలిపారు. తాము అధికారంలోకి రావడానికి ముందు 2014లో టెక్ పరిశ్రమలో 3.23 లక్షల ఉద్యోగాలు మాత్రమే ఉండేవని, తాము అధికారం నుంచి దిగిపోయే నాటికి అవి 10 లక్షలకు చేరాయని చెప్పారు. 2014లో రూ.56 వేల కోట్లు ఉన్న ఐటీ ఎగుమతులు, 2023 నాటికి రూ.2.41 లక్షల కోట్లకు చేరాయని తెలిపారు. ఇదంతా తమ ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత, మార్గదర్శకత్వంతోనే సాధ్యమైందని అన్నారు. ఇండియా లాంటి వైవిధ్యభరితమైన దేశంలో ఒక పరిశ్రమ, సంస్థను ఏర్పాటుచేయడంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతాయని చెప్పారు. ఆ సంక్లిష్టతను టీఎస్ ఐపాస్‌తో తాము దూరం చేశామని అన్నారు. ఆన్‌లైన్‌లో ఎవరైనా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంటే 15 రోజుల్లో అనుమతులు వస్తాయని తెలిపారు. ఒకవేళ రాకుంటే అనుమతులు వచ్చినట్టుగానే భావించి పరిశ్రమను ప్రారంభించుకోవచ్చని వివరించారు. దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలోనూ ఈ విధానం లేదని అన్నారు. టీఎస్ ఐపాస్‌తో తమ హయాంలో 28 వేల పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామని చెప్పారు. ఫలితంగా రూ.3.5 లక్షల కోట్ల పెట్టుబడులు తెలంగాణకు వచ్చాయని వెల్లడించారు. తద్వారా 24 లక్షల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాల కల్పన జరిగిందని చెప్పారు.

### దేశం నివ్వెరపోయేలా 'కాళేశ్వరం'

**ఇంజినీరింగ్** అద్భుతంగా చెప్పుకునే చైనాలోని త్రీగోర్జెస్ డ్యామ్‌కు సరిసమానమైన ప్రాజెక్టు తెలంగాణలోని కాళేశ్వరం అని కేటీఆర్ అభివర్ణించారు. ప్రపంచంలోని అతిపెద్ద బహుళ ఎత్తిపోతల పథకం కాళేశ్వరంతో 80 మీటర్ల సముద్ర మట్టపు ఎత్తు నుంచి 600 మీటర్ల ఎత్తుకు నీళ్లను తీసుకునిపోయి ప్రతిసీజన్‌కు 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. ఇండియా లాంటి ప్రజాస్వామ్య దేశంలో ఒక ప్రాజెక్టును నిర్మించడం చాలా కష్టం అన్న కేటీఆర్, అందుకు కావలసిన అన్ని రకాల అనుమతులను తీసుకొని, ప్రాజెక్టుతో నష్టపోతున్న నిర్వాసితులకు సరైన పరిహారం ఇచ్చి కేవలం 3 సంవత్సరాల కాలంలోనే పూర్తిచేసి దేశం మొత్తం నివ్వెరపోయేలా చేశామని పేర్కొన్నారు. ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉన్న ఇండియాలో ప్రతీ ఇంటికి శుద్ధిచేసిన తాగునీటిని అందించడం స్వప్నంగానే ఉన్న సమయంలో, కేసీఆర్ నేతృత్వంలోని తమ ప్రభుత్వం దేశంలోనే తొలిసారి కోటి ఇండ్లకు మిషన్ భగీరథతో సురక్షిత మంచి నీటిని అందించిందని ఉద్ఘాటించారు. దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలోనూ ఉపరితల నీటి వనరులతో ప్రతిఇంటికీ శుద్ధిచేసిన తాగునీటిని ఇప్పటికీ అందించడం లేదని వివరించారు.

### సులభతర వాణిజ్యంలో తెలంగాణ నంబర్‌వన్

ముఖ్యమంత్రిగా కేసీఆర్ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు, అమలు చేసిన వినూత్న విధానాలతో సులభతర వాణిజ్యంలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా ఎదిగిందని కేటీఆర్ వివరించారు. తన ప్రసంగంతో తెలంగాణ విజయయాత్రను సాధికారికంగా వివరించిన కేటీఆర్, బ్రిడ్జ్ ఇండియా సదస్సులో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. సదస్సుకు హాజరైన వివిధ దేశాల రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు కేటీఆర్ ప్రసంగానికి ముగ్ధులయ్యారు. ఆయన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు.

## లోకం పోకడ




మర్యాదగా పాలు తాగుతావా? ట్రంప్‌ని పిలవాలా? దేశం నుంచి గెంటేస్తాడు, జాగ్రత్తా.. తాగు!

## వానా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 37.9°c | 25.4°c |
| మెదక్ | 36.5°c | 26.7°c |
| నల్లగొండ | 36.0°c | 24.2°c |
| వరంగల్ | 35.0°c | 26.0°c |
| మహబూబ్‌నగర్ | 34.0°c | 23.0°c |
| నిజామాబాద్ | 34.0°c | 24.4°c |
| ఖమ్మం | 34.0°c | 25.0°c |
| హైదరాబాద్ | 33.6°c | 23.6°c |
| రంగారెడ్డి | 33.6°c | 15.9°c |
| కరీంనగర్ | 32.0°c | 27.0°c |


## పట్టువీడని మిస్టర్ 10%

మొదటిపేజీ తరువాయి...

కనిపించడం లేదు. పనులకు టెండర్లు ఖరారు చేసిన సమయంలో ఉన్న నిబంధనల ప్రకారం దక్షిణ డిస్కం కేబుల్ సమకూర్చాలని, ఒకవేళ తాము స్వయంగా కేబుల్ తెచ్చుకోవాలంటే ఏ రేటులో తెచ్చుకోవాలి.. ఏ క్వాలిటీలో తెచ్చుకోవాలనే విషయం డిస్కం నిర్ణయించాలని, ఒకవేళ ధర ఎక్కువైతే ఎవరు భరిస్తారనే విషయంపై అధికారులకు, కాంట్రాక్టర్లకు మధ్య చర్చ జరిగింది. దీనిపై అధికారులకు కాంట్రాక్టర్లు లేఖలు కూడా రాశారు. కానీ అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో పనులు ఎక్కడివక్కడే ఆగిపోయాయి.

### 'జూబ్లీ' విషయంలో తెగని పంచాయితీ

జూబ్లీ బస్టాండ్‌లో చార్జింగ్ స్టేషన్‌కు సంబంధించి 33 కేవీ కేబుల్ వేస్తే పనులు పూర్తవుతాయి. 'నమస్తే తెలంగాణ'లో 'మిస్టర్ టెన్ పర్సెంట్' కథనం వచ్చిన తర్వాత జూబ్లీ బస్‌స్టేషన్‌లోని చార్జింగ్ స్టేషన్ పనులను మెట్రో సీఈ, సికింద్రాబాద్ ఎస్‌ఈలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేబుల్ వేయకపోవడంతో పనులు నిలిచిపోయాయనే వార్తలు రావడంతో ఆర్టీసీ అధికారులను డిస్కం అధికారులు మందలించినట్టు సమాచారం. అయితే తాము కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పనులు జరగట్లేదని, వెంటనే పనులు పూర్తి చేయాలని ఆర్టీసీ అధికారులు కోరినట్టు సమాచారం. దీనిపై మెట్రోజోన్ సీఈతో పాటు ఇతర అధికారులు కేబుల్ లేకుండా పనులు ఎలా చేయాలనే దానిపై చర్చించారు. ఓవర్‌హెడ్ వేస్తే కేబుల్ అవసరం లేకుండానే పని పూర్తవుతుందనే ఆలోచనకు రావడంతో సంబంధిత కాంట్రాక్టర్‌ను సంప్రదించారు. తనకు కేబుల్ సరఫరా చేయాలని, లేకుంటే ఓవర్‌హెడ్ వేయాలంటే రివైజ్డ్ ఎస్టిమేషన్‌తో అగ్రిమెంట్ చేసుకోవాలని అధికారులకు కాంట్రాక్టర్ తేల్చి చెప్పాడు. ఈ రివైజ్డ్ ఎస్టిమేషన్‌కు ఆర్టీసీ అంగీకరించాలి, కాబట్టి ఇదంతా ఇప్పట్లో జరిగే పని కాదని అధికారులే చెప్పుకుంటున్నారు. కేబుల్ విషయంలో జరిగిన రభసతో ఏం చేయాలో, పనులు ఎలా పూర్తి చేయాలో అర్థంకాక సతమతమవుతున్నట్టు మెట్రోజోన్ అధికారి ఒకరు తెలిపారు.




### మిగతా పనులు అటకెక్కినట్టే..

స్టోర్స్‌లో కేబుల్ లేదన్న విషయాన్ని అధికారులు బహిరంగంగానే చెప్తున్నారు. తమకు అవసరం లేదు కాబట్టి తాము కొనుగోలు చేయబోమని చేతులెత్తేశారు. ఒకవేళ కొనుగోలు చేయాలంటే 'మిస్టర్ టెన్ పర్సెంట్' డిమాండ్‌ను పూర్తిచేయాల్సి ఉంటుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లు ఎవరికి వారే కేబుల్ తెచ్చుకోవాలని చెప్పడంతో కాంట్రాక్టర్లు తమ నిబంధనలను లేఖ రూపంలో అధికారులకు పంపారు. ఇక, విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయంగా చేసే సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులు అత్యవసరం కాదని, వాటికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదని జీఎం స్థాయి అధికారి ఒకరు తెలిపారు. అయితే, అత్యవసరం కాకుంటే సమ్మర్ యాక్షన్ ప్లాన్ అంటూ మార్చిలోనే ఒప్పందాలు ఎలా కుదుర్చుకున్నారన్న ప్రశ్న తలెత్తుతున్నది. ఈ ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పడం లేదు. కేబుల్ లేక పనులు ఆగుతున్నప్పటికీ మిస్టర్ టెన్ పర్సెంట్ ముచ్చటే తప్ప, ప్రజా ప్రయోజన పనులపై అధికారులకు సోయి లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.




అమెరికాలోని డాలస్‌లో శుక్రవారం జరిగిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, రోహిత్‌రెడ్డి, గాదరి కిశోర్, గువ్వల బాలరాజు, బీఆర్‌ఎస్ నేతలు బాలమల్లు, బీఆర్‌ఎస్ గ్లోబల్ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్ బిగాల మహేశ్ తదితరులు

# డాలస్‌కు పోటెత్తనున్న యువకెరటాలు

- సన్నాహకాల్లో వారిదే సింహభాగం
- ఆన్‌లైన్‌లో 70% మంది యూత్ రిజిస్ట్రేషన్
- రేపే డాలస్‌లో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ
- కార్యాచరణకు బీఆర్‌ఎస్ కీలక నేతలు
- కేసీఆర్ చేతిలోనే తెలంగాణ పదిలం: ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): అమెరికాలోని డాలస్‌లో జూన్ 1న జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు యువత, విద్యావంతులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారు. ఇందుకు గత 10 రోజులుగా జరుగుతున్న సన్నాహక సమావేశాలే స్పష్టం చేస్తున్నాయి. సభకు వచ్చేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిలో 70% మంది యువత ఉన్నదని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం డాలస్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్, యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ వంటి ప్రముఖ విశ్వవిద్యాలయాల విద్యార్థులతో ఆయా విద్యాసంస్థల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం విశేషం. డాలస్‌లోని డాక్టర్ పెప్పర్ అరినాలో జూన్ 1న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు, బీఆర్‌ఎస్ రజతోత్సవాలను అమెరికా అబ్బురపడే రీతిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తికావచ్చాయి. బీఆర్‌ఎస్ గ్లోబల్ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్, బీఆర్‌ఎస్ యూఎస్‌ఏ అడ్వైజరీ చైర్మన్ మహేశ్ తన్నీరు సహా యూఎస్‌ఏలో ఉండే తెలంగాణీయులు భారీ సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేసేందుకు అవసరమైన కార్యాచరణను అమలు చేస్తున్నారు. అందులో భాగంగా బీఆర్‌ఎస్ ఎన్నారై విభాగంతోపాటు, పార్టీ కీలక నేతలు, మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు ఇప్పటికే అమెరికాకు చేరుకున్నారు. డాలస్ రజతోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యేందుకు లండన్ పర్యటన ముగించుకొని శుక్రవారమే అమెరికాకు పయనమయ్యారు. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, వీ శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, తాతా మధు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గాదరి కిశోర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, రసమయి బాలకిషన్, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, కోరుకంటి చందర్, చంటి క్రాంతికిరణ్, గువ్వల బాలరాజు, పైలట్ రోహిత్‌రెడ్డి తదితరులు ఇప్పటికే అమెరికాకు చేరుకొని సన్నాహక సమావేశాల్లో తలమునకలయ్యారు.

### కేసీఆర్ చేతిలోనే తెలంగాణ పదిలం

తెలంగాణ భవిష్యత్తు కేసీఆర్ చేతిలో ఉంటేనే సురక్షితంగా ఉంటుందని, ప్రజలు కూడా ఇదే కోరుకుంటున్నారని మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, వీ శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. అమెరికాలోని డాలస్‌లో శుక్రవారం జరిగిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ విప్లవాత్మకంగా పురోగమించిందని చెప్పారు. రాష్ట్రంలోని పేదలు, రైతుల కష్టసుఖాలు తెలిసిన ఏకైక నాయకుడు కేసీఆరేనని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ అన్నిరంగాల్లో వెనక్కి వెళ్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో తెలంగాణను చూసి దేశం అనుసరించే పరిస్థితిని కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. కేసీఆర్ దూరదృష్టితోనే ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ పేరు మారుమోగిందని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ సారథి మాజీ చైర్మన్ రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. బీఆర్‌ఎస్ యూఎస్‌ఏ అడ్వైజరీ చైర్మన్ మహేశ్ తన్నీరు సమావేశాన్ని సమన్వయం చేశారు. సమావేశంలో పార్టీ నేతలు, ఎన్నారై విభాగం నాయకులు జాన్సన్ నాయక్, ముఠా జయసింహ, పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఆశిష్ యాదవ్, అభిలాశ్ రంగినేని పాల్గొన్నారు. ఉదయ్ యాదవ్, సామ్ పుసపల్లి, శశి దొంతినేని, అనిల్ పెండ్యాలతోపాటు వివిధ విద్యాలయాల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చరిత్రలో డాలస్ సభ మైలురాయి

- అధిక సంఖ్యలో యూత్, స్టూడెంట్స్ రాక
- సన్నాహక సమావేశాలతో కొత్త ఉత్సాహం
- 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్‌ఎస్ యూఎస్‌ఏ అడ్వైజరీ బోర్డు చైర్మన్ మహేశ్ తన్నీరు

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ చరిత్రలో డాలస్‌లో జూన్ 1న జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ మైలురాయిగా నిలిచిపోతుందని బీఆర్‌ఎస్ యూఎస్‌ఏ అడ్వైజరీ బోర్డు చైర్మన్ మహేశ్ తన్నీరు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణీయుల ఆలోచనలకు ప్రతిబింబంగా డాలస్ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. నాడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయాన యూఎస్‌ఏలో ఉన్న తెలంగాణ పౌరులు ఏ స్థాయిలో ఆరాటాన్ని, ఆసక్తిని చూపించారో అలాంటి ఆసక్తే నేడు డాలస్ సభపై చూపుతున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో సుదీర్ఘకాలం పోరాడి తెలంగాణను సాధించి, పదేండ్లపాటు అన్ని రంగాల్లో అద్భుతంగా పురోగమించిన తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై ఎన్నారైలు ఏమనుకుంటున్నరు? అనే విషయాన్ని డాలస్ సభ ప్రతిబింబిస్తుందని తెలిపారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యే పార్టీ రజతోత్సవాల సభా ఏర్పాట్లలో గత 15 రోజులుగా తలమునకలైన ఆయన నమస్తే తెలంగాణకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు ఇలా ఉన్నాయి.

**నమస్తే తెలంగాణ: డాలస్ సభ ఏర్పాట్లను వివరిస్తారా?**

**మహేశ్ తన్నీరు:** చాలా అద్భుతంగా జరుగుతున్నాయి. అమెరికా సహా అనేక దేశాల్లో బీఆర్‌ఎస్ ఎన్నారై కమిటీలు నిర్వహించిన సభల్లో ఇదే అతి పెద్దదిగా నిలుస్తుంది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో నాడు తెలంగాణ కోసం ఉద్యమం సాగుతున్నప్పుడు ఎన్నారైల్లో కనిపించిన ఆసక్తి, ఉత్సాహం ఇప్పుడూ కనిపిస్తున్నది. బీఆర్‌ఎస్ సిల్వర్ జూబ్లీ సభ వరంగల్‌లో విజయవంతమైంది. ఆ స్ఫూర్తితో ఇక్కడ మేము ఏర్పాట్లు చేస్తున్నాం. దాదాపు అన్నీ పూర్తి కావచ్చాయి. యూఎస్‌ఏలో ఉన్నవాళ్లే కాకుండా



యూకే సహా ఇతర దేశాల్లో ఉన్న బీఆర్‌ఎస్ ఎన్నారైలే కాకుండా తెలుగువాళ్లు ఎందరో ఈ సభకు వచ్చేందుకు ఆసక్తిని చూపుతున్నారు. డాలస్‌కు ఎవరెవరు వస్తారు? వచ్చేవాళ్లకు ఏ అసౌకర్యం కలుగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? వాటికి ఎవరెవరు బాధ్యతలు తీసుకోవాలి? వంటి విషయాలపై ముందే ప్లాన్ చేసుకున్నాం. ఆ ప్రకారమే ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ సభ సక్సెస్ కోసం మాకు సహకారం అందించేందుకు పార్టీ ముఖ్య నేతలు ఎందరో వచ్చేశారు. జూన్ 1న డాలస్‌లోని డాక్టర్ పెప్పర్ అరినాలో జరిగే సభకు బీఆర్‌ఎస్ వర్కింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా వస్తున్నారు. ఈ ప్రాంగణానికి అనేక విశిష్టతలు ఉన్నాయి. డాలస్‌లో ఇంత పెద్ద ప్రాంగణం మరొకటి లేదు. గతంలో ఇక్కడ ప్రధాన మంత్రి మోదీ సభ జరిగింది. ఇప్పుడు ఆ స్థాయిలోనే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొనే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ఏర్పాట్లు చేస్తున్నాం. డాలస్ సభ విజయవంతం అయ్యాక ఏడాది పొడవునా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దాదాపు అన్ని దేశాల్లో ప్రవాస తెలంగాణీయులను కలిసేలా సమావేశాలు నిర్వహించాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది. అందులో భాగంగా లండన్, ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా, గల్ఫ్ (దుబాయ్)లో సభలు పెట్టాలని అనుకుంటున్నాం.

**సభ ఏర్పాట్లు ఎలా సాగుతున్నాయి?**

రెస్పాన్స్ చాలా బాగుంది. మా ఎన్నారై వింగ్‌తోపాటు పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు దాదాపు 30 మంది అమెరికాలోని దాదాపు అన్ని ప్రధాన నగరాల్లో ఉన్న తెలంగాణీయులను కలుస్తున్నారు. ఒక్క బీఆర్‌ఎస్ ఎన్నారై వింగ్ వాళ్లనే కాకుండా ఇతర తెలుగు అసోసియేషన్లలో ఉన్న వాళ్లు ఎంతోమంది వచ్చి కలుస్తున్నారు. అన్ని రాష్ట్రాల్లో ఉన్న మనవాళ్లు మీటింగ్‌కు వస్తామని చెప్తుంటే సంతోషంగా ఉన్నది. ముఖ్యంగా యూత్, యూఎస్‌ఏలోని యూనివర్సిటీల్లో చదివే విద్యార్థులు మీటింగ్‌కు వచ్చేందుకు అమితాసక్తిని చూపుతున్నారు. సభకు వచ్చే ప్రతినిధుల కోసం రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాం. అద్భుత స్పందన వచ్చింది. అన్ని ప్రాంతాల్లో సన్నాహక సమావేశాలకూ మంచి రెస్పాన్స్ వచ్చింది. బీఆర్‌ఎస్ గ్లోబల్ ఎన్నారై కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల స్థానికంగా ఉన్నవాళ్లతో కలిసి సమన్వయం చేస్తున్నారు. జూన్ 1న డాలస్‌లోని డాక్టర్ పెప్పర్ అరినా ప్రాంగణమంతా ఎటు చూసినా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబిస్తాయి. ఆ మేరకు ఏర్పాట్లు చేశాం. యూఎస్‌ఏతోపాటు ఇతర దేశాల్లో ఉన్న తెలంగాణ వాసులు డాలస్ సభపై ఆసక్తిని చూపుతున్నరు.

> **తెలంగాణ ఎన్నారైలు అంతగా ఆసక్తిని చూపేందుకు ప్రత్యేక కారణాలు ఏవైనా ఉన్నాయా?**
>
> **ఒక** రాజకీయ పార్టీ ఒక నాయకుడి ఆలోచనల్లోంచి పుట్టి విజయవంతంగా 25 ఏండ్లు విజయవంతంగా కొనసాగడమే కాకుండా ఏ లక్ష్యం కోసమైతే పార్టీ ఆవిర్భవించిందో ఆ లక్ష్యాన్ని చేరుకోవడం అరుదైన ఘటన. కేసీఆర్ నాయకత్వంలో 25 ఏండ్ల క్రితం పార్టీ పుట్టడం, ఆ పార్టీ గొడుగు కింద తెలంగాణ రాష్ట్రం సాధించడం, పదేండ్లపాటు ప్రతీ తెలంగాణ బిడ్డ గర్వపడేలా కేసీఆర్ పాలించడం ఇలా అనేక సందర్భాలను సెలబ్రేట్ చేసుకోవడానికి యూఎస్‌ఏలో ఉన్న తెలంగాణ బిడ్డలం జూన్ 1 కోసం వేయిట్ చేస్తున్నాం. వేలాది మంది ఆసక్తిని చూపుతున్నరు. ఇక్కడ ఉన్న ప్రతీ తెలంగాణ బిడ్డ గర్వపడుతున్నారు. కేసీఆర్ అంటే వారికి అమితాభిమానం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేవలం 10 ఏండ్ల స్వల్ప సమయమే అయినా దేశంలో అన్ని రాష్ట్రాల కన్నా అద్భుతంగా ముందుకు సాగింది. తెలంగాణలో ఇప్పుడు కాంగ్రెస్ పాలన దుష్ప్రరిణామాలపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంత స్వల్పకాలంలోనే తెలంగాణ ఇలా కావడాన్ని ఎన్నారైలు జీర్ణించుకోలేకపోతున్నరు.

## కేసీఆర్‌తోనే తెలంగాణకు ప్రపంచ ఖ్యాతి

**రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్‌దే అధికారం**

**డాలస్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

మహబూబ్‌నగర్ అర్బన్, మే 30 : కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాబోయే రోజుల్లో మళ్లా బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. అమెరికాలోని డాలస్ రాష్ట్రంలో శుక్రవారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఎన్‌ఆర్‌ఐ నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం డాలస్‌లోని గాంధీ పార్కు వద్ద నిర్వహించిన కారు ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జూన్ 1న డాలస్‌లో జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సంబురాలకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధికి ఎన్‌ఆర్‌ఐల సహకారం ఎంతో అవసరమని కోరారు.

## విస్తరించిన నైరుతి.. తగ్గిన ఎండలు

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో అల్పపీడనం బలహీనపడి వాయుగుండంగా మారిందని, ఈ ప్రభావంతో తెలంగాణ, ఏపీలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ తెలిపింది. పారాదీప్‌నకు ఈశాన్యంగా 190 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమైందని వెల్లడించింది. తెలంగాణలో నైరుతి రుతుపవనాలు పూర్తిగా విస్తరించాయని పేర్కొంది. రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గి, 30 డిగ్రీ సెల్సియస్‌గా నమోదవుతున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో 4 రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఓ ప్రకటనలో తెలిపింది.



## పొగచూరుతున్న బతుకులు

- పొగాకుతో ఏటా 13లక్షల మరణాలు
- దేశంలో 25 కోట్ల మంది వినియోగం
- క్యాన్సర్‌తో కుటుంబాలు ఛిన్నాభిన్నం
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): దేశంలో పొగాకు వినియోగం అతిపెద్ద సమస్యగా మారింది. హానికారకమని తెలిసినా చాలామంది దీని బారినపడి ఇబ్బందులు కొనితెచ్చుకుంటున్నారు. దేశంలో 25 కోట్ల మందికి పైగా పొగాకు వినియోగదారులు ఉన్నట్టు ప్రజారోగ్య నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఏటా 13లక్షల మంది పొగాకు వినియోగం కారణంగా మరణిస్తున్నారు. దేశంలోని క్యాన్సర్ కేసుల్లో మూడింట ఒక వంతు పొగాకు వినియోగం ద్వారా సంభవిస్తున్నాయి. క్యాన్సర్‌తో పాటు గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధులకు పొగాకు వినియోగమే కారణమవుతున్నది.

### పొగాకు వినియోగంతో వచ్చే వ్యాధులు

**క్రోనిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ వ్యాధి (సీవోపీడీ):** ఊపిరితిత్తుల్లో వాయుప్రవాహానికి ఆటంకం కలిగిస్తుంది. వ్యాధి తీవ్రమైతే శ్వాస తీసుకోవడం ఇబ్బంది కరంగా మారుతుంది. క్రమంగా ఊపిరితిత్తుల పనితీరును దెబ్బతీస్తుంది.

**గుండె సంబంధిత వ్యాధులు:** పొగాకు వాడకం వల్ల ధమనులు ఇరుకుగా మారి రక్తప్రసరణ తగ్గుతుంది. తద్వారా కరోనరీ హార్ట్ వ్యాధి వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ధూమపానం వల్ల రక్తపోటు పెరుగుతుంది. అంతేకాక రక్తం గడ్డ కట్టే అవకాశం పెరుగుతుంది. ఇది గుండెపోటుకు దారి తీస్తుంది. గుండెకు ఆక్సిజన్ సరఫరా తగ్గించడంతో పాటు గుండె కండరాన్ని బలహీన పరుస్తుంది.

**ఊపిరితిత్తుల, నోటి క్యాన్సర్:** ధూమపానం దాదాపు 85శాతం ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులకు కారణమవుతున్నది. పొగాకు వాడకంతో నోరు, గొంతు, అన్నవాహిక వంటి ఇతర క్యాన్సర్‌లకు దారి తీస్తున్నది.

**సంతానోత్పత్తిపై ప్రభావం:** ధూమపానం మహిళల సంతానోత్పత్తిపై ప్రభావం చూపడంతో పాటు గుండెపోటుకు కారణమవుతున్నది.

### పొగాకు మానేందుకు పలు థెరపీలు

చాలా మంది యువత సిగరెట్లు తాగుతున్నారు. అది అలవాటుగా మారి జీవితాలను నాశనం చేస్తున్నది. ప్రస్తుతం పొగాకు వినియోగం మానేసేందుకు పలు థెరపీలు ఉన్నాయి. నికోటిన్ రిప్లేస్‌మెంట్ థెరపీలో భాగంగా నికోటిన్ చూయింగమ్స్ అందుబాటులోకి వచ్చాయి. కాగ్నేటివ్ బిహేవియర్ థెరపీతో బాధితులకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం. గ్రూప్ థెరపీతో పొగాకు మానేసిన వారి స్టోరీలను బాధితులకు చెప్తున్నాం. వారితోనే బాధితులకు కౌన్సిలింగ్ ఇప్పిస్తున్నాం. కొంతమంది మహిళలు కూడా సిగరెట్లు కాలుస్తున్నారు. వారిలో సంతానోత్పత్తి సమస్యలతో పాటు పుట్టిన శిశువులకు అవిటితనం వస్తున్నది. ప్రభుత్వం కూడా మెడికల్ కాలేజీల్లో నికోటిన్ థెరపీని స్టార్ట్ చేసింది. పొగాకు మానేయాలని అనుకునేవారు వెంటనే డీఅడిక్షన్ సెంటర్లు, సైకియాట్రిస్ట్‌లను సంప్రదించాలి.

–డాక్టర్ విశాల్ ఆకుల, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణ రాష్ట్రశాఖ జనరల్ సెక్రటరీ